■ **విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి**



బిళ్లపాడులో మినుము సాగును పరిశీలిస్తున్న అధికారులు

గుడివాడరూరల్: రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా పొందాలని జిల్లా వనరుల కేంద్రం డీటీసీ కె.జ్యోతి రమణి పేర్కొన్నారు. మండలంలోని బిళ్లపాడులో ఏఓ అనంత లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంగళవారం ఆమె మాట్లాడారు. గుడివాడ మండలంలో 4,500 మంది సాగుభూమి ఉన్న రైతులు ఉండగా ఇప్పటి వరకు 3,004 మంది మాత్రమే నమోదు చేసుకున్నారని తెలిపారు. అనంతరం గ్రామంలోని మినుము సాగును పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.శ్రీనివాస్, గుడివాడ ఏడీఏ రమాదేవి, జిల్లా వనరుల కేంద్రం ఏఓ బి.పద్మజ, ఏఈఓ డి.అనూష పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు పరిశీలన

మండవల్లి: పెరికెగూడెం రైతుసేవా కేంద్రంలో మంగళవారం నిర్వహిస్తున్న విశిష్ట నమోదు సంఖ్యను సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి ఎస్‌కె జరీనా పరిశీలించారు. వీఏఏలు గోపాల్, చాప్లిన్, సంధ్య పాల్గొన్నారు.

■ **ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ**

మండవల్లి: అంగన్‌వాడీ కార్యకర్తలకు మండవల్లి హైస్కూల్లో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ మంగళవారం ముగిసింది. ఎంఈఓ రత్నసునాదం ఈ కార్యక్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ఆర్పీలు రూప్‌కుమార్, రాజేష్, సూఫియాన్ పాల్గొన్నారు.

■ **రైల్వేగేట్ మూసివేత**

మండవల్లి: మొఖాసాకలవపూడి–సింగనపూడి రైల్వేగేట్‌ను ఫిబ్రవరి 28 నుంచి మార్చి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు మూసివేయనున్నట్లు కైకలూరు రైల్వే స్టేషన్ సీనియర్ సెక్షన్ ఆఫీసర్ అబ్దుల్ రహమాన్ మంగళవారం పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలో ట్రాక్ మరమ్మతుల కోసం లెవెల్ క్రాసింగ్ నంబర్ 69ని మార్చి 3వ తేదీ రాత్రి ఏడు గంటల వరకు మూసివేస్తున్నామని తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు గమనించి రైల్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.

■ **మహిళ అదృశ్యంపై కేసు**

గుడివాడరూరల్: ఓ మహిళ అదృశ్యంపై గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ ఎన్.చంటిబాబు కథనం మేరకు మండలంలోని మోటూరుకు చెందిన కందుల నాగలక్ష్మి భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త బంధువులు, స్నేహితుల ఇళ్లు గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. నాగలక్ష్మి ఇంటి నుంచి వెళ్లి పోయిన సమయంలో ఆరెంజ్ రంగు జాకెట్, పింక్ అండ్ గ్రీన్, ఎల్లో మల్టీ కలర్ పాత చీర ధరించిందని ఎస్‌ఐ తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 94407 96427కు సమాచారం అందించాలని కోరారు.

■ **మద్యం దుకాణాల మూసివేత**

కైకలూరు: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో కైకలూరు నియోజకవర్గంలోని 21 మద్యం దుకాణాలతో పాటు కల్లు దుకాణాలను మూసి వేయాలని ఆదేశాలిచ్చినట్లు కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ ఎస్‌కె.రమేష్ మంగళవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం సాయంత్రం నాలుగు నుంచి గురువారం సాయంత్రం నాలుగు గంటల వరకు మద్యం దుకాణాలు మూసి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ పి.ఆదినారాయణ పాల్గొన్నారు.

■ **ఆలపాటి విజయానికి కృషి**

తోట్లవల్లూరు: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఆ పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో జిల్లా మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి ఆయన పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్లు అంతా ఆలపాటికి ఓటు వేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొన్నారు.

■ **తడి, పొడి చెత్తపై అవగాహన**

గుడ్లవల్లేరు: తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు చేసే విధానంపై గుడ్లవల్లేరు, గుడివాడ, నందివాడ మండలాలకు చెందిన శానిటేషన్ వర్కర్లకు అవగాహన సదస్సును గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

■ **ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించండి**

మొవ్వ: కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. మండలంలో పలు ప్రభుత్వ స్కూల్స్, కాలేజీలు, సంస్థలలో ఎమ్మెల్సీ ఓటు కలిగి ఉన్న వారిని మంగళవారం ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు నాయకులు కలిసి ప్రచారం నిర్వహించారు. యుటీఎఫ్ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి కనకారావు, కృష్ణా జిల్లా కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఆ స్వామి నామమే..

- ఆనాటి గౌతమవరమే నేటి కొతవరం
- శివరాత్రికి గౌతమేశ్వరాలయంలో మహా రుద్రాభిషేకం



గౌతమేశ్వరాలయం (ఇన్‌సెట్లో) స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలోని కౌతవరంలో ఉన్న గౌతమేశ్వరస్వామి ఆలయం ఎంతో విశిష్టతను సంతరించుకుంది. ఈ గ్రామంలోని ఇళ్లల్లో ఎన్నో ఏళ్ల నుంచి పుట్టిన పిల్లలకు ఆ స్వామి పేరును పెట్టుకోవడం విశేషం. ఆనాటి గౌతమవరం గ్రామాన్నే నేటి కౌతవరంగా పిలుస్తున్నారు. దివంగత ప్రముఖ రచయిత తాళ్లూరి మంగపతిరావు కౌతవరం చరిత్రను మూడు పుస్తకాలుగా తరతరాల వారు చదువుకునేందుకు రచించారు. ఆ రచనల ఆధారంగా గౌతమ మహాముని సంచరించిన ఈ ప్రాంతంపై బౌద్ధ ప్రభావం కూడా పడింది. ఈ ప్రాంతంలో గౌతమ మహర్షి మూడు వేల ఏళ్ల క్రితం తపస్సు చేశారు. ఆ మహాముని తపస్సు చేసినప్పటి శివలింగం కాల గర్భంలో కలిసిపోయింది. గోవులు పెంచే ఓ వ్యక్తికి మహా శివుడు కలలో సాక్ష్యాత్కరించారు. తనకు ఆలయం నిర్మించమని గ్రామస్తులకు నిదర్శనం ఇచ్చేందుకు భూమిలో నుంచి ఒక అడుగు శివలింగం ఉద్భవించింది. గౌతమ మహాముని తపస్సు చేయటం వలన ఈ శివ లింగం ఉద్భవించిందని ప్రతీతి. దీంతో ఈ ఆలయానికి గౌతమేశ్వరాలయం అనే నామకరణం చేశారు. చిట్టడవిగా ఉండే ఈ ప్రాంతాన్ని గౌతమవరంగా పిలుస్తూ కాలక్రమంలో కౌతవరంగా వాడుకలోకి తెచ్చారు. గ్రామంలో ఈనాటికీ అందరి ఇళ్లలో స్వామివారి పేరిట గౌతమి, గౌతమేశ్వరరావు, గౌతయ్య, గౌతమ్, గౌతమ్మ పేర్లు వాడుకలో ఉన్నాయి. ఈ విశిష్టాలయంలో మహా శివరాత్రి సందర్భంగా బుధవారం రుద్రాభిషేకం నిర్వహిస్తారు.

కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ముదినేపల్లి రూరల్: స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జాస్మిన్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ శారద ఉత్తర్వులు జారీ చేశారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం గత నెల 4న కళాశాల్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఆలస్యంగా హాజరుకావడంతో పాటు స్థానిక కూటమి నాయకుల విషయంలో ఆమె ప్రవర్తించిన తీరుపై ఆర్జేడీకి ఫిర్యాదు చేశారు. దీనిపై కృష్ణా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి సాల్మన్‌రాజ్ ఇటీవల విచారణ చేపట్టారు. ఈ నివేదిక ఆధారంగా ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా అధ్యాపకుడు సత్యనారాయణమూర్తి నియమితులయ్యారు.

ఘనంగా రుద్రాభిషేకం

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని పర్వత వర్ధనీ సహిత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని నందీశ్వరునికి పంచామృతాభిషేకం అర్చకులు కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

భవనం మరమ్మతులకు నిధుల మంజూరు

ముదినేపల్లి రూరల్: స్థానిక ఎస్సీ కళాశాల స్థాయి బాలుర వసతి గృహం భవనం మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. మరమ్మతులతో పాటు మౌలిక వసతుల కల్పనకు రూ.4.5 లక్షలు మంజూరు చేశారు. మరమ్మతులు శరవేగంగా పూర్తిచేసి రానున్న విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని వార్డెన్ అప్పలస్వామి తెలిపారు.

చిన్నారులకు ఫిజియోథెరపీ

మండవల్లి: లోకుమూడి హైస్కూల్లోని భవిత సెంటర్‌లో మంగళవారం ఫిజియోథెరపిస్ట్ కె.సునీత ప్రత్యేక అవసరాలు గల తొమ్మిది మంది చిన్నారులకు ఫిజియోథెరపీ శిబిరంలో చికిత్స చేశారు. రోజూ చిన్నారులకు వారి ఇళ్లవద్ద ఉదయం, సాయంత్రం ఆయిల్ రాసి క్యాంపులో మాదిరిగా ఎక్సైర్‌సైజులు చేయించాలని ఫిజియోథెరపిస్ట్ పేర్కొన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ సాధించిన విద్యార్థులకు సన్మానం



సునీత, అలేఖ్యను సన్మానించిన ఉపాధ్యాయులు

గుడ్లవల్లేరు: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్) ఎంపికైన డి.సునీత, ఎస్.అలేఖ్యను గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల అధినేత శింగంశెట్టి ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. తమ పాఠశాల్లో 1–5వ తరగతి చదివిన సునీత, అలేఖ్య ఎన్‌ఎంఎంఎస్ సాధించటం తమ పాఠశాలకే గర్వకారణమని పేర్కొన్నారు. వీరికి 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా రూ.12వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందన్నారు.

వీరాంజనేయ స్వామికి విశేష పూజలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. తొలుత ఆలయంలో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. నాగవల్లీలతో శత సహస్ర నామాలతో విశేషంగా వడ మాలలతో స్వామికి పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్, సిబ్బంది శ్రీహరి పాల్గొన్నారు.

పాతాళ భోగేశ్వరా..
పాహిమాం.. పాహిమాం

కలిదిండిలో నేడు శివరాత్రి తీర్థం, తెప్పోత్సవం






శివరాత్రికి ముస్తాబు చేసిన పాతాళ భోగేశ్వర శివాలయం (ఇన్‌సెట్లో) కలిదిండి భోగేశ్వరలంకలో పాతాళ భోగేశ్వరస్వామి

కైకలూరు: దేవదాయ–ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో దక్షిణ కాశీగా పేరుపొందిన పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి (కలిదిండి) కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి 1.20 గంటలకు స్వామి దివ్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ భక్తులకు ఏర్పాట్లు కల్పించారు. బుధవారం శివరాత్రి తీర్థం సందర్భంగా పంచబుగ్గల కోనేరు వద్ద తగు జాగ్రత్తలు తీసుకున్నామని, భక్తులకు 'క్యూ' లైన్లు ఏర్పాటు చేశామని ఈఓ తెలిపారు.

నాగలితో దున్నుతుండగా..

భోగేశ్వరలంకలో ఒక రైతు పొలంలో నాగలితో దున్నుతుండగా, నాగలికర్ర తగిలి రక్తం పారుతూ ఒక స్వయంభు లింగం బయటపడింది. నాగలి కర్రు విరిగిన భాగాన్ని అతికించినట్లు చరిత్ర చెబుతోంది. ఇప్పటికే ఈ భాగం ఒక పక్క విరిగినట్లు, అతికించినట్లుగా ఉన్న భాగం నుంచి రక్తపునీరు చమర్చినట్టు గోచరిస్తోందని భక్తుల విశ్వాసం. ఈ లింగాన్ని కలిదిండి తీసుకొచ్చేందుకు రైతు విఫలయత్నం చేశాడు. ఆ రాత్రి స్వామి భక్తుల కలలో కనిపించి కోడికూత, రోకటిపోటు వినలేనంటూ ఏకాంతంగా ఉన్న ఈ చోటనే ఆలయ నిర్మించాలని కోరాడని ఇక్కడ స్థల పురాణం చెబుతోంది.

స్వామివారి పాదాల గుర్తులు



పూర్వం వర్షాకాలంలో ఒక రోజున జోరున వర్షం కురుస్తుంటే స్వామి వారి నిత్యార్చనకు ఆలస్యమవయడంతో స్వామి స్వయంగా ధ్వజస్తంభం ఎక్కి అర్చకుల రాకను గమనించి ధ్వజస్తంభంపై నుంచి దూకడంతో కింద స్వామివారి పాదాల గుర్తులు ఏర్పడ్డాయని చెబుతారు. ఈ పాదాల గుర్తులను ఇప్పటికీ ప్రత్యక్షంగానే చూస్తున్నామని భక్తులు చెబుతున్నారు. కొన్నేళ్ల క్రితం ఓ భారీ నాగసర్పం తరచూ శివలింగాన్ని చుట్టుకుని ఉండటాన్ని ఆ ప్రాంత వాసులు చూశారు. ఈ ఆలయంలో నందీశ్వరునికి విశేషంగా భక్తులు పూజలు చేస్తారు. కోనేరు వద్ద భక్తితో 'హరహరా' అంటే 'బుడ బుడ' మంటూ నీరు పైకి ఉబికి రావడం భక్తులను పారవశ్యంలో ముంచెత్తుతుంది.



భోగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ

ఉత్సవాలకు ఏర్పాట్లు



పోలీసు అవుట్‌పోస్టును ప్రారంభించిన డీఎస్పీ

కైకలూరు: దక్షిణ కాశీగా పేరొందిన కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి దేవస్థానం వద్ద శివరాత్రి మహోత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ బుధవారం విధులు నిర్వహించే సిబ్బందికి దేవస్థానం వద్ద మంగళవారం అవగాహన కల్పించారు. పోలీసు అవుట్‌పోస్టును డీఎస్పీ ప్రారంభించారు. కలిదిండి ఎస్‌ఐ వి.వేకంటేశ్వరరావు మాట్లాడుతూ బుధవారం రోజు సమీప ప్రాంతాల నుంచి లక్ష మంది పైబడి భక్తులు స్వామి దర్శనానికి విచ్చేస్తారని అంచనా వేస్తున్నామన్నారు. ఇప్పటికే తెప్పోత్సవం నిర్వహించే చెరువులో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ మాట్లాడుతూ శివరాత్రి తీర్థం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు



జల్లుస్నానాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

తోట్లవల్లూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన ఐలూరు శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ తెలిపారు. మండలంలోని ఐలూరులో శివరాత్రి బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. కృష్ణానది తీరాన్ని, జల్లు స్నానాలను పరిశీలించారు. ఎంపీడీఓ రవికాంత్, పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్‌ఐ అవినాశ్ పాల్గొన్నారు.

కరకట్టపై ట్రాఫిక్ మళ్లింపు..

ఐలూరు ఉత్సవాలను పురస్కరించుకుని కృష్ణా కరకట్టపై మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు పమిడిముక్కల సీఐ చిట్టిబాబు తెలిపారు. విజయవాడ నుంచి అవనిగడ్డ వైపు వెళ్లే వాహనాలు తోట్లవల్లూరు, ఉయ్యూరు మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు లంకపల్లి నుంచి కృష్ణాపురం మీదుగా మంటాడ వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు.